

వాహన మిత్రకు సిద్ధం

వాహన మిత్ర పథకం అమలుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 14,320 మంది లబ్ధి పొందనున్నారు. - 8లో



రెండు ఆటోలు ఢీ

పొందూరు మండలంలో రెండు ఆటోలు ఢీకొని ప్రమాదం జరిగింది. పలువురు గాయపడ్డారు. - 8లో

కిమ్స్‌లో తక్కువ ధరకే గుండె పరీక్షలు

అరసవల్లి: ప్రపంచ హార్ట్ డే సందర్భంగా స్థానిక కిమ్స్ సాయి శేషాద్రి ఆస్పత్రిలో శుక్రవారం గుండె జబ్బు నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే చేయనున్నామని హాస్పటల్ డైరెక్టర్ గూడేన సోమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.5 వేల విలువైన ఈసీజీ, 2డి ఎకో, టిఎంటి సీరం క్రియేటినైన్, హెచ్‌బి, ఆర్‌బిఎస్, లిపిడ్ ప్రొఫైల్, కన్సల్టేషన్ తదితర పరీక్షలను కేవలం రూ.1199కే చేయనున్నామని, ఈ అవకాశాన్ని జిల్లా వాసులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



హృదయమా.. పదిలమా.?



- జిల్లాలో రోజురోజుకీ పెరుగుతున్న హృద్రోగులు
- కరోనా తర్వాత మారిన పరిస్థితులు
- రిస్క్ గ్రూపులో జిల్లాలో 23శాతం మంది
- మంచి జీవన శైలితో గుండె పదిలం
- నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గుండె లయ తప్పుతోంది. ఒకప్పుడు వృద్ధాప్యం వస్తేనే వణికిన హృదయం.. నేడు యవ్వనంలోనూ భయపెడుతోంది. కోవిడ్ కాలం గడిచాక ఈ ముప్పు మరీ పెరిగింది. ఇటీవల కాలంలో జరిగిన ఓ సర్వేలో జిల్లాలో 23 శాతం మంది హైపర్‌టెన్షన్, డయాబెటిస్, ఊపిరితిత్తులు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్టుగా తేలింది. వీరిలో హైపర్ టెన్షన్, డయాబెటిస్ ఉన్న వారిలో చాలావరకు గుండె జబ్బుల బారిన పడుతున్నారు. కోవిడ్ వచ్చాక సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, పోస్టు కోవిడ్‌లో భాగంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకోకపోవడం, సరైన పోషక ఆహారం, తగిన వ్యాయామం, విశ్రాంతి తీసుకోకపోవడం, దినచర్యలో ఒత్తిడికి గురవ్వడంతో హృద్రోగ సమస్యలు ఎదురవుతున్నట్టుగా వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్యశ్రీ అండ

ఒకప్పుడు గుండె సంబంధిత సమస్యలొస్తే విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. శ్రీకాకుళంలోనే గుండె సంబంధిత ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. కార్డియాలజిస్టులు కూడా ఎక్కువమందే ఉన్నారు. ఆరోగ్యశ్రీ సాయంతో పేదల గుండెలకు కూడా రక్షణ లభిస్తోంది. రోగి నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా, తిరిగి ఖర్చుల కింద సొమ్ము చెలిస్తూ ప్రభుత్వం వైద్యం చేయిస్తోంది. బైపాస్ సర్జరీలు, ఓపెన్ హార్ట్ సర్జరీలు, స్టంట్స్, ఇతరత్రా శస్త్ర చికిత్సలన్నీ ఉచితంగానే వైఎస్ జగన్ ప్రభుత్వం చేయిస్తోంది. వైద్యం అందించడమే కాకుండా ఉచితంగా మందులు, ఖర్చుల కింద రూ.4500 నుంచి రూ.9500 వరకు డబ్బులు రవాణా చార్జీలు కూడా ఇస్తోంది. ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలో జెమ్స్, మెడికవర్, కిమ్స్ తదితర ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వేలాది మంది గుండె శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు.

“ శ్రీకాకుళం నగరంలోని ఓ వైద్యుని కుటుంబానికి చెందిన చిన్నారి గుండె సమస్యతో ఏళ్ల తరబడి బాధపడుతున్నా గుర్తించలేదు. జ్వరం ఇతరత్రా సమస్యలు వస్తుంటే సాధారణమేనని ఆ వైద్య కుటుంబీకులు తేలికగా తీసుకున్నారు. ఒకరోజు పరిస్థితి విషమించి ఏకంగా ప్రాణాలు విడిచాడు. ”

“ ఎచ్చెర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల అబ్బాయి విశాఖలోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతుండగా తరచూ జ్వరం, ఆయాసం వచ్చేది. దీంతో తల్లిదండ్రులు శ్రీకాకుళంలోని ఓ వైద్యుడికి చూపించారు. ఆ బాబుకి గుండెలో రంధ్రం ఉందని గుర్తించారు. ఇక్కడ ఉంచడం సరికాదని, తిరుపతిలో ఉన్న టీటీడీకి చెందిన స్విమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించాలని, అక్కడ సర్జరీ చేయాల్సిన అవసరం ఉందని సలహా ఇచ్చారు. వెంటనే ఆ పిల్లాడ్ని స్విమ్స్ తీసుకెళ్లేసరికి ప్రముఖ వైద్యులు శ్రీనాథ్ రెడ్డి వెంటనే చూసి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని చెప్పారు. వెంటనే చేయాలని చెప్పడంతో ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా హుటాహుటిన ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. ఇప్పుడా విద్యార్థి డిశ్చార్జ్ అయి కోలుకున్నాడు. ”

గుండె జబ్బుల విషయంలో ముందుగానే మేలుకోవడం ఎంత అవసరమో చెప్పడానికి ఈ రెండు ఘటనలే ఉదాహరణ

మీ గుండె మీ చేతల్లోనే..

గుండెను ఆరోగ్యంగా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి అనువైన వ్యాయామం, చెడు అలవాట్లకు దూరంగా ఉంటే హృదయం పదిలంగా ఉంటుందని అంటున్నారు. ఈ అవగాహన కల్పించడానికే ఏటా సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవం జరుపుకుంటారు. ఓ వయసు దాటాక ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం కూడా ఉత్తమమని వైద్యుల సూచన.

ఆరోగ్య శ్రీ కింద జిల్లాలో జరిగిన శస్త్ర చికిత్సలు

సంవత్సరం	కేసులు	వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన ఖర్చు
2019-20	1025	రూ. 3,25,32,638
2020-21	629	రూ. 1,97,77,167
2021-22	1909	రూ. 5,49,85,802
2022-23	4417	రూ. 14,63,45,978
2023-24 (నేటివరకు)	3143	రూ. 10,82,34,402

వయసుతో సంబంధం లేదు..



కోవిడ్ తర్వాత గుండె సమస్యలు పెరిగాయి. ఒకప్పుడు 25-40 ఏళ్ల వయస్సులో హార్ట్ సమస్యలు అరుదుగా చూశాం. ఇప్పుడు ఆ వయస్సులో వారిలో 100 మందిలో 25శాతం మందికి హార్ట్ సమస్యలు వస్తున్నాయి. ఒకప్పుడు 40ఏళ్లు దాటిన వాళ్లకి ఈసీజీ, టుడీ ఎకో, టీఎంటీ చేసుకోవాలని చెప్పేవారం. ఇప్పుడు వయస్సుతో సంబంధం లేకుండా ఆ పరీక్షలు చేసుకోవాలని చెబుతున్నాం. గుండె జబ్బులొచ్చినా ఖర్చు కోసం భయపడనక్కర్లేదు. ప్రభుత్వమే ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా వైద్యం చేయిస్తోంది.

– డాక్టర్ బుడుమూరు అన్నాజీరావు, కార్డియాలజిస్టు, మెడికవర్ ఆసుపత్రి

అప్రమత్తంగా ఉండాలి



గుండె ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం. రోజుకి 45 నిమిషాలు వ్యాయామం చేయాలి. జంక్ ఫుడ్స్ తినడం హృదయానికి మంచిది కాదు. ఒత్తిడి తగ్గించుకుని, ప్రాణాయామం చేయడంఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ సాయితేజ, కార్డియాలజిస్టు, జెమ్స్ ఆసుపత్రి

ఒత్తిడి వద్దు



ఒత్తిడిని జయిస్తే చాలా వరకు హృదయ సంబంధిత వ్యాధుల నుంచి బయటపడొచ్చు. జీవన విధానంలో మార్పులు అవసరం. శరీరంలో మార్పు రాగానే అప్రమత్తమవ్వాలి. రెగ్యులర్‌గా తనిఖీలు చేసుకుంటే మంచిది.

– డాక్టర్ కె.సతీష్, కార్డియాలజిస్టు, కిమ్స్ ఆసుపత్రి

చికిత్సలో విప్లవాత్మక మార్పులు



గుండె చికిత్స పద్ధతులతో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. పిల్లలకు, పెద్దలకు పూర్తిగా చికిత్స చేయవచ్చు. సమస్య వచ్చిన వెంటనే కార్డియాలజీ విభాగం ఉన్న ఆస్పత్రిని సంప్రదించాలి. సాధారణ ఆరోగ్యాన్ని జీవితకాలం అనందించవచ్చు.

– డాక్టర్ కళ్యాణ్, కార్డియాలజిస్టు, కిమ్స్ ఆసుపత్రి

జీవన శైలితోనే..



ప్రజల జీవన శైలి కారణంగానే గుండె సమస్యలు వస్తున్నాయి. యువతలో కూడా గుండె వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు జనరల్ ఓపీలో 5 కేసులు రావడం అరుదు. ఇప్పుడు 10 నుంచి 15శాతం కేసులు వస్తున్నాయి. ముఖ్యంగా జంక్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి.

– డాక్టర్ విజయకుమార్, కార్డియాలజిస్టు, జెమ్స్ ఆసుపత్రి

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



కోవిడ్ తర్వాత వయస్సుతో సంబంధం లేకుండా హృదయ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఎక్కువగా యువత ధూమపానం, మద్యపానం చేయడం వలన హృదయ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు.

– డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, కార్డియాలజిస్టు, కిమ్స్ ఆసుపత్రి

పిల్లలకు పూర్తిగా నయం చేయవచ్చు..



గుండె ఏర్పడే సమయంలో జరిగే అసాధారణ పరిస్థితుల వల్ల పిల్లల్లో గుండె జబ్బులు వస్తాయి. వీరికి శస్త్ర చికిత్స పద్ధతులు, ఇంటర్వెన్షనల్, నాన్ ఇంటర్వెన్షనల్ పద్ధతుల ద్వారా వైద్యం అందించవచ్చు. శస్త్ర చికిత్సలో గుండె తెరుస్తాం. సమస్యను గుర్తించి చికిత్స చేస్తాం. 'ఇంటర్వెన్షనల్' విధానంలో చిన్న తీగలు, గొట్టాలు శిశువు తొడ నాళాల నుంచి గుండెలోకి పంపి చికిత్స చేస్తాం. నాన్-ఇంటర్వెన్షనల్ చికిత్సను తేలికపాటి గుండె జబ్బులు ఉన్న పిల్లలకు చేస్తాం. గుండె సమస్యలతో జన్మించిన పిల్లలకు పూర్తిగా చికిత్స చేయవచ్చు. గుండె జబ్బులు ఉన్న పిల్లల తల్లిదండ్రులు చైల్డ్ హార్ట్ ప్రోగ్రామ్ ఉన్న ఏదైనా కార్డియాక్ సెంటర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ వి.పవన్ కుమార్, కన్సల్టెంట్ పిడియాట్రిక్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు, స్టార్ పినాకిల్ హార్ట్ సెంటర్, విశాఖపట్నం

సీతంపేట డిప్యూటీ ఈఈ తిరుమలరెడ్డి సస్పెన్షన్

అరసవల్లి: స్థానిక విద్యుత్ శాఖ సర్కిల్ పరిధిలోని సీతంపేట (మన్యం పార్వతీపురం జిల్లా) డిప్యూటీ ఈఈ పి.తిరుమలరెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొంత కాలంగా తిరుమలరెడ్డిపై అవినీతి, అక్రమాల ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు తాజాగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ విషయాన్ని ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ ధ్రువీకరించారు. తిరుమలరెడ్డి స్థానంలో పాలకొండ డిప్యూటీ ఈఈ చక్రవర్తికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

'సంకేత భాషలపై అవగాహన కల్పించాలి'


శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో సంకేత భాషలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం సందర్భంగా జిల్లా డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక డే అండ్ నైట్ జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. డే అండ్ నైట్ కూడలి వద్ద ప్రారంభమైన ర్యాలీ బాపూజీ కళామందిర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుందని, దివ్యాంగుల్లో మరింత ఎక్కువగా ఉంటుందని అన్నారు. వారిలో ప్రతిభను వెలికి తీయాలన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్











క్లుప్తంగా

1న స్కూల్‌గేమ్స్ రోల్‌బాల్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ రోల్‌బాల్ ఎంపిక పోటీలు అక్టోబర్ ఒకటో తేదీన జరగనున్నాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డీఈఓ కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి జిల్లాలోని పలాస ఉన్న స్కేటింగ్ రింక్‌లో అండర్-14, అండర్-17, అండర్-19 బాలబాలికల ఎంపికలు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను త్వరలో జరిగే రాష్ట్రపోటీలకు పంపించనున్నట్టు చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9290905399, 9705462218 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

నూతన పోలింగ్ కేంద్రాల పరిశీలన



నూతన పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ గురువారం ఉదయం పరిశీలించారు. స్థానిక సీఎస్ఎస్ఎం స్కూల్‌లో కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ నంబర్ 263, 264, 265లను ఆయన స్వయంగా పరిశీలించి ఆర్డీఓ, ఎమ్మార్వోలకు తగు సూచనలు ఇచ్చారు. గతంలో ఉన్న నాలుగు పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో మూడు కేంద్రాలను ఓటర్ల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా బూత్‌లలో సీలింగ్, పవర్ సప్లై, కిటికీలను, గది వైశాల్యాన్ని కొలతలు వేసి నివేదిక సమర్పించాలన్నారు. అలాగే ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూలు, చౌదరి సత్యనారాయణ కాలనీలో నూతన ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు ఉన్నారు.

ఉల్లాసంగా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు



టెక్కలిలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికల్లో రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, నెట్ బాల్, రగ్బీ, రూప్ స్కిప్పింగ్ తదితర క్రీడల ఎంపికలకు 125 పాఠశాలల నుంచి సుమారు 650 మంది బాల బాలికలు హాజరయ్యారు. వివిధ క్రీడల్లో నిర్వహించిన ఎంపికల్లో ఉల్లాసంగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించారు. ఇందులో ఎంపికైన వారంతా రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని మీట్ ఆర్గనైజర్ బి.నారాయణరావు వెల్లడించారు. పీడీలు వై.శేఖర్‌బాబు, పి.తిరుపతిరావు, జి.శ్రీనివాసరావు, ఎన్.రమేష్, కె.ప్రకాశ్, రాజా, రమణ, వాసుదేవరావు, పావని, దివ్యవాణి, నాగరాజు, ఉష, ఆదిశేషు రఘునాథరావు తదితరులు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

ట్రామా ఎమర్జెన్సీపై 108 ఉద్యోగులకు శిక్షణ



పలాస సీహెచ్‌సీలో శిక్షణలో పాల్గొన్న 108 ఈఎంటీలు, సిబ్బంది

పలాస : పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. 108 డివిజన్ స్థాయి సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ హరి ప్రసాద్, పలాస ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ గండేటి జగన్ పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ శిక్షణ తరగతులు నిర్వహించారు. అత్యధికంగా జిల్లాలో జాతీయ రహదారి, రాష్ట్ర స్థాయి, సబ్, పట్టణ రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలు(ట్రామ ఎమర్జెన్సీస్), ఎయిర్‌వే మేనేజ్‌మెంట్, 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు వాటి ఉపయోగాల గురించి సమీక్ష తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పలాస డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఈయంటి పాతాళ సత్యం, బత్తిని తారక్, ఉప్పాడ గోపాలకృష్ణ, అవుగాన నారాయణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

● ముస్లింల శాంతి ర్యాలీ



మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రకాష్ నగర్ కాలనీలోని హుస్సేని మసీదు నుంచి ప్రారంభమైంది. జీటీ రోడ్డు, పాలకొండ రోడ్డు, డేఅండ్‌నైట్ కూడలి మీదుగా వెళ్లి పీఎస్ఎన్ఎం హైస్కూలు మీదుగా జామియా మసీదు చేరుకుంది. అనంతరం మత గురువులు మహ్మద్ ప్రవక్త కోసం ప్రసంగించారు.

శ్రీకాకుళం కల్చరల్

వాహన మిత్రకు సర్వం సిద్ధం

- ఆటోలు, టాక్సీలు, క్యాబ్ డ్రైవర్లకు రూ.10వేలు సాయం
- జిల్లాలో 14,320 మంది లబ్ధిదారులు

శ్రీకాకుళం రూరల్: వరుసగా నాల్గో ఏడాది వాహన మిత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. శ్రీకాకుళంలోని కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటోలు, క్యాబ్‌లు, టాక్సీ డ్రైవర్లు 14,320 మందికి రూ.10వేల వంతున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు జిల్లా రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. బీమా, రోడ్‌టాక్సులు కట్టేందుకు ఈ సొమ్ము ఉపయోగపడనుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాది నుంచే ఈ సాయాన్ని అందజేస్తున్నారు. 2019-20లో 13,539 మందికి, రెండో ఏడాదికి 2020-21లో 15,484 మందికి, 2021-22లో 14,978 మందికి, అలాగే 2022-23లో 13,492 మందికి చివరిగా 2023-24 ఏడాదికు గాను 14,320 మందికి అర్హులుగా జిల్లా రవాణాశాఖాధికార్లులు వెల్లడించారు. గత ఏడాది కంటే ఈ ఏడాదిలో సుమారు 826 మంది అధికంగా ఈ పథకానికి అర్హత సాధించారు. మొత్తం రూ.14.3 కోట్లను డ్రైవర్ల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

ప్రతి డ్రైవర్‌కు ప్రయోజనం



ఈ వాహన మిత్ర పథకం ప్రతి డ్రైవర్‌కు ఉపయోగపడుతుంది. ఆయా వాహనాలకు సంబంధించిన బీమాలు, పొల్యూషన్, రోడ్ టాక్సులు ఈ డబ్బుతో కట్టుకోవచ్చు. వాహనాలకు వచ్చే చిన్నచిన్న మైనర్ రిపేర్లు సైతం చేసుకోవచ్చు. గడిచిన నాలుగు ఏడాదుల్లో రవాణా శాఖ ద్వారా వాహనమిత్రకు జిల్లా వ్యాప్తంగా రాష్ట్రప్రభుత్వం కేటాయించిన నిధులు సుమారు రూ.72 కోట్లకు పైనే ఉంది.

– శివరాం ప్రసాద్, డీటీసీ

ఈ డబ్బుతోనే..



నేను 2019లో టాక్సీ (టయోటా కారు) తీసుకున్నాను. నాకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వాహన మిత్ర అందుతోంది. ఆ డబ్బుతోనే బండి పత్రాలు రెన్యువల్ చేస్తున్నాను. మాబోటి వారికి ఇది ఎంతో ఉపయోగపడుంది.

– తండేల శ్రీనివాసరావు, పొందూరు

మా ప్రభుత్వంలో మహిళలకే ప్రాధాన్యత

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకే ప్రాధాన్యత ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని మంగువారితోటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ధరల పెంపుపై ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని, ధరల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటుందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం ఉండదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. పేద ప్రజల బతుకులు బాగుపడాలన్న ఆలోచనతో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు గౌరవంగా బతికితే చూడలేని మోసకారి చంద్రబాబుకు ఓటేస్తారో..? ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వైఎస్ జగన్‌కు ఓటేస్తారో నిర్ణయించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో రోడ్లు, పెద్ద మార్కెట్, అర్బన్ హెల్త్ సెంటర్ వంటివాటితో పాటు డంపింగ్‌యార్డుకి రూ.9కోట్లు వెచ్చించి అనేక పనులు చేస్తున్నామన్నారు. అలాగే అరసవల్లి ప్రజలకు రూ.22కోట్లు విలువైన రెండెకరాల స్థలాన్నిచ్చి ఆట స్థలం, పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అలాగే 900 బెడ్‌లతో రిమ్స్ హాస్పటల్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు, పార్టీ యువ నేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, పార్టీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, పాపారావుస్వామి, బలగ గణపతి పట్నాయక్, ఎండ రమేష్, కనపల తేజ, టంకాల బాలకృష్ణ, గుడ్ల దామోదరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పార్టీ సమన్వయకర్త, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు, జిల్లాలోని అన్ని మండలాల జేసీఎస్ కో-ఆర్డినేటర్లు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా పార్టీ కార్యవర్గం, అలాగే ఎంపీపీలు, జెడ్పీటీసీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు విధిగా హాజరు కావాలని కోరారు.

పీజీ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల సౌలభ్యం కోసం రాష్ట్ర పోస్టు గ్రాడ్యుయేషన్ టెస్ట్-2023 (ఏపీ పీజీ సెట్) కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్రంలోని 14 స్టేట్ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పిస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సైతం పీజీ ప్రవేశాలు పీజీ సెట్ కౌన్సెలింగ్ ద్వారానే నిర్వహిస్తారు. మారిన షెడ్యూల్ మేరకు శుక్రవారం వరకు ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం కల్పించారు. 30న ఆప్షన్ల మార్పున కు అవకాశం ఇచ్చారు. అక్టోబర్ 3వ తేదీన సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. అక్టోబర్ 4 నుంచి కాలేజీలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 5 నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభిస్తారు.

ఐటీడీఏ ఏర్పాటుకు సానుకూల స్పందన

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఏపీ అసెంబ్లీ సభ్యుల షెడ్యూల్డ్ తెగల కమిటీ సమావేశంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టిలో ఐటీడీఏ కేంద్రంతో పాటు, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సభ్యుల షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ సానుకూలంగా స్పందించిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న షెడ్యూల్డ్ తెగల కమిటీ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సభ్యుల షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ సమావేశం జరిగినట్లు ఆమె తెలిపారు. కమిటీలో సభ్యురాలిగా జిల్లాలోని గిరిజనుల ఆకాంక్షలను తెలిపానని చెప్పారు. సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోవడంతో శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని వివరించానని తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ అత్యధికంగా గిరిజనులు ఉన్నారని, సమీపంలో ఉన్న సారవకోట, మందస, సరుబుజ్జిలి తదితర ప్రాంతాల్లోని గిరిజనులకు అందుబాటులో ఉన్న మెళియాపుట్టి ప్రాంతంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే గిరిజన బాలికలు 10వ తరగతి తర్వాత చదువు మానేస్తున్నారని, వారి కోసం పాతపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరానని చెప్పారు. ఈ విషయమై గతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించానని తెలిపానన్నారు. కమిటీ సభ్యులు కూడా సానుకూలంగా స్పందించారని, పాతపట్నం నియోజకవర్గం గిరిజనులకు త్వరలో మంచి కబురు వస్తుందన్నారు.

రెండు ఆటోలు ఢీ



అంబులెన్స్‌లో బాధితులను తరలిస్తున్న దృశ్యం

పొందూరు: మండలంలోని లోలుగు కూడలి నుంచి బురిడికంచరాం రహదారిలో గురువారం రాత్రి రెండు ఆటోలు ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. బురిడికంచరాంకు చెందిన పలువురు జి.సిగడాం మండలంలోని ఆనందపురం అగ్రహారంలో ఓ శుభకార్యానికి ఆటోలో వెళ్తుండగా.. ఎదురు గా వచ్చిన లగేజీ ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో ప్రయాణికులతో ఉన్న ఆటో బోల్తా పడగా అందులో ఉన్న వి.ధనలక్ష్మి, యం.ఉషారాణి, ఎం.సంజు, వి.నితిన్‌తో పాటు మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ సంఘటనలో లగేజీ ఆటోలో ఉన్న డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న సహాయకులు పరారయ్యా రు. గాయపడిన వారిని మూడు అంబులెన్స్‌లలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ ఎంపికలు



ప్రాబబుల్స్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల సాఫ్ట్‌బాల్ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. ప్రాబబుల్స్ జట్లను ఎంపికచేసి శిక్షణశిబిరాల అనంతరం త్వరలో తుది జట్లను వెల్లడించనున్నట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి నరసింహరాజు, సిగిలిపల్లి లక్ష్మీ దేవి తెలిపారు. ఎంపికలను ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు ప్రారంభించారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు ఖరారు



జిల్లా సీనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్, రాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ బాస్కెట్ బాల్ జట్లు ఖరారయ్యాయి. శ్రీకాకుళం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సీనియర్స్ పురుషులు, మహిళల జట్లను ప్రకటించారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడామైదానంలో గత పది రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరాల అనంతరం క్రీడాకారుల రాణింపు ఆధారంగా తుది జట్లను ప్రకటించడం జరిగిందని జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, డీఎస్ఏ కోచ్ జి.అర్జున్‌రావు రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఈ జట్లు గురువారం సాయంత్రం పోటీలకు మార్టూరుకు బయల్దేరి వెళ్లాయి.

జిల్లా జట్ల వివరాలు

పురుషుల జట్టు: సీహెచ్ గణేష్ (కెప్టెన్), బి.నవీన్, ఐ.సంతోష్, ఎ.అశోక్, కె.జయకృష్ణ, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎ.అజయ్, పి.లీలాప్రసాద్, ఐ.భార్గవ్, ఎం.కార్తీక్, పి.ప్రద్యుమాన్, పి.నవీన్. స్టాండ్‌బైగా ఎం.జశ్వంత్, డీఎస్‌డీఎస్ పట్నాయక్.

మహిళల జట్టు: డి.దుర్గాప్రశాంతి (కెప్టెన్), ఎండీ హఫీజ, ఎస్.పద్మశ్రీ, ఎస్.ప్రేమశ్రీ, పి.కళ్యాణి, బి.స్పందన, ఎం.మౌణిక, ఎల్.ప్రమీల, ఎస్.సురేఖ, పి.శ్రావణి, డి.హిమకళ్యాణి, అక్షయ ఎంపికయ్యారు. ఈ జట్లకు కోచ్‌గా జి.అర్జున్‌రావురెడ్డి, మేనేజర్‌గా హమీద్ వ్యవహరించనున్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు విద్యార్థులు



జాతీయ పోటీలకు, రాష్ట్రపోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం ఐడీవీ ప్రసాద్, పీడీ సతీష్‌రాయుడు, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాత్రునివలస విద్యార్థులు జోరు కనబర్చారు. పలు క్రీడాంశాల్లో జాతీయస్థాయి, రాష్ట్రపోటీలకు ఎంపికై శభాష్ అనిపించారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకాలతో మోత మోగించారు. జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత్రునివలస నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో 39 కేజీల బాలికల విభాగంలో తాన్ని మేఘన (9వ తరగతి) బంగారు పతకం సాధించగా, 48 కేజీల బాలురు విభాగంలో తోనంగి ధనుంజయ (9వ తరగతి) బంగారు పతకం సాధించాడు. దీంతో వీరిద్దరూ జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీలకు నేరుగా ఎంపికయ్యారు. ఈ పోటీలు మధ్యప్రదేశ్‌లో జరగనున్నాయి. కాగా విద్యార్థులకు ఉత్తమ శిక్షణను అందించి ఉన్నతమైన క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న ఫిజికల్ డైరెక్టర్ రాజనాల సతీష్ రాయుడు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. జాతీయ పోటీలకు, రాష్ట్రపోటీలకు ఎంపికైన క్రీడాకారులు, పీడీని ప్రధానోపాధ్యాయులు ఐడీవీ ప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మొయ్యిల వాసుదేవరావు, గ్రామ పెద్దలు బాణాల గాంధీ, పంచిరెడ్డి అప్పలనాయుడు, బాణాల బలరాం, ఉపాధ్యాయులు తదతరులు అభినందించారు.

రాష్ట్రపోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీలకు గొడ్డు శంతన్ (10వ తరగతి), ఈపు లక్ష్మణరావు (10వ తరగతి), బొంతల జితేంద్ర (10వ తరగతి), కె.నితిన్ (10వ తరగతి), బాణాల చరణ్ (10వ తరగతి), తోనంగి నరేంద్ర (9వ తరగతి), ముక్కు హారిక (9వ తరగతి), బాణాల సాయిశ్రీనివాస్ (9వ తరగతి) అండర్-14 హ్యాండ్‌బాల్ విభాగంలో బాణాల మనోహర్ (9వ తరగతి), ధర్మాన గిరిధర్ (9వ తరగతి), కర్పూర భార్గవి (9వ తరగతి), ఆవల కిరణ్ (8వ తరగతి), పెంటమణి మణికంఠ (7వ తరగతి), జోగ ఆంజనేయులు (7వ తరగతి) ఎంపికయ్యారు. హాకీ అండర్-14 విభాగంలో మెండ మోహిని (8వ తరగతి), తట్ట భవాని (8వ తరగతి), తట్ట రోహిత్ (8వ తరగతి), గొడ్డు శ్యామ్ (7వ తరగతి) రాష్ట్రపోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు.

శ్రీకాకుళంలో సదరన్ ట్రావెల్స్ సేవలు



కొత్త బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, తదితరులు

- పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభం
- జిల్లా నుంచి దేశ, విదేశాలకు సేవలు



కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవంలో అతిథులు

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: ప్రముఖ ట్రావెల్స్ సంస్థ సదరన్ ట్రావెల్స్ శ్రీకాకుళంలో కొత్త బ్రాంచ్‌ను ప్రారంభించింది. శ్రీకాకుళంలోని విశాఖ కాలనీ సమీపంలో రామలక్ష్మణ్ జంక్షన్ ఆర్ఎస్ దేవి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని గురువారం ప్రారంభించారు. దక్షిణ భారతదేశం నుంచి వేలాది మంది ప్రయాణికులు సదరన్ ట్రావెల్స్‌పై విశ్వసనీయమైన నమ్మకాన్ని కలిగి ఉన్నారని అతిథులు ప్రశంసించారు. శ్రీకాకుళంలో కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేయడం సంతోషకరమని, కొత్త బ్రాంచ్ ద్వారా అత్యున్నత స్థాయి ప్రమాణాలు గల సేవలను అందిస్తామని సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి కృష్ణ మోహన్ తెలిపారు. దేశ విదేశాల్లో ఫ్లైట్ బుకింగులు, హాలిడే ప్యాకేజీలు, ప్రపంచ వ్యాప్తంగా హొటల్ రిజర్వేషన్లు, వీసా సేవలను శ్రీకాకుళం నుంచి కూడా అందజేస్తామని వివరించారు. ఈ ట్రావెల్స్ ద్వారా యూరప్, దుబాయ్, థాయ్‌లాండ్, వియత్నాం, సింగపూర్, మలేషియాతో పాటు మాల్దీవులకు వెళ్లడానికి సేవలు అందజేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

అలాగే ఛార్‌ధామ్, వారణాశి, వైష్ణోదేవి, గోవా, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, డార్జిలింగ్, కశ్మీర్ వంటి దేశీయ పర్యాటకానికి సదరన్ ట్రావెల్స్ సేవలు అందజేస్తుందని వెల్లడించారు. 1500 కు పైగా ట్రావెల్ ప్యాకేజీలతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందజేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన సదరన్ ట్రావెల్స్ సేవలను వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు ఆర్య వైశ్య మహాసభ వైస్ ప్రెసిడెంట్ తమ్మన్న భాస్కర్, పీఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ పూన సర్వేశ్వరరావు, సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరక్టర్ ఆలపాటి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, MCA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discontinued) Exams in October/November ✆ : 73383 76874 [R-103]

PLOT FOR SALE

■ SUDA లే అవుట్, పైడి భీమవరం జం॥ NH ఫేసింగ్, కమర్షియల్ & రెసిడెన్షియల్ ప్లాట్స్ అమ్మకం. 40 ఫీట్ రోడ్స్, స్పాట్ రిజిస్ట్రేషన్, లోన్ సౌకర్యం కలదు. ఫోన్ : 98851 28080 [V-2152]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు విశాఖలో పనిచేయుటకు స్త్రీ/పు కావలెను. విద్యార్హత: 7th/Degree. Pass/Fail. వ: 18-30 సం॥ లోపు. జీతం: 13 వేలు నుండి 30 వేలు +కమీషన్ ఇవ్వబడును. ఫోన్: 86398 98452, 83419 42227 [V-2149]

■ ఇంట్లో పిల్లలను చూసుకుంటూ ఇంటి పని చేయడానికి (F) కావలెను. వయస్సు : 22 సం॥లోపు, భోజన వసతులు కల్పించబడును. (ఏ బాదరా బంది లేనివారికి ప్రాధాన్యత ఇవ్వబడును). ఫోన్ : 99666 22394 [V-797321]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221646]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9160900024 [HA-657]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.